డ్రంకెన్ డ్రైవ్‌లో 216 కేసులు

బంజారాహిల్స్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో మద్యం తాగి వాహనాలు నడపవద్దని పోలీసులు చేసిన సూచనలను మందు బాబులు పెడచెవిన పెట్టారు. పీకల దాకా మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు చిక్కారు. పశ్చిమ మండలం పరిధిలో 216 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. వేడుకల్లో భాగంగా డిసెంబరు 31న రాత్రి నుంచి ట్రాఫిక్ పోలీసులు పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. బంజారాహిల్స్‌లో 38, జూబ్లీహిల్స్‌లో 65, పంజాగుట్ట 49, సంజీవరెడ్డినగర్‌లో 64 కేసులు నమోదయ్యాయి. పంజాగుట్ట పోలీసుస్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అత్యధిక మోతాదులో బీఎంఏ 550 రావడం గమనార్హం. వాహనాలను సీజ్ చేసిన పోలీసులు వారంతా కోర్టుకు హాజరుకావాలని నోటీసులు జారీ చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈసేవ, పీఈఐయూజీ ఫీడర్ల పరిధిలోని రోడ్ నంబర్లు 36,62,63,64,65 ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నందినగర్, సెరికల్చర్ ఫీడర్ల పరిధిలోని నందినగర్ బస్‌స్టాండ్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, హనుమాన్ టెంపుల్, మిథిలా నగర్, జూబ్లీహిల్స్ రోడ్ నంబర్లు 8,11,13,14,18,72, ప్రశాసన్ నగర్, ఫిలింనగర్ రహదారి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

మరమ్మతుల కారణంగా గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 వరకు ఎర్రగడ్డ ఫీడర్ పరిధిలోని బీఎస్‌పురి కాలనీ, సుల్తాన్‌నగర్,శంకర్‌లాల్ నగర్, నటరాజన్ నగర్, నేతాజీ నగర్ ప్రాంతాల్లో.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రేమ్‌నగర్, ఐఏఎస్ క్వార్టర్స్ ఫీడర్ల పరిధిలోని ఎర్రగడ్డ, ప్రేమ్‌నగర్, ఛత్రపతి శివాజీ నగర్, బ్రహ్మ శంకర్‌లాల్ నగర్, శ్రీనివాస కాలనీ ఈస్ట్, 2 ఆర్టీ, 3 ఆర్టీ, ఎస్ఆర్‌నగర్ బస్‌స్టాప్ వెనుక ప్రాంతం, గాయత్రీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

- నూతన సంవత్సరం సందర్భంగా దేవాలయాలకు క్యూ
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ రోడ్లపై భారీగా ట్రాఫిక్ జామ్


బంజారాహిల్స్ జగన్నాథ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ


జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద భక్తుల సందడి

బంజారాహిల్స్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం వేళ దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. ఏడాదంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు క్యూ కట్టారు. దీంతో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్ నియోజకవర్గాల పరిధిలోని అన్ని ఆలయ ప్రాంగణాలు భక్తులతో కిటకిటలాడాయి. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి దేవాలయంలో ఉదయం 3 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అప్పటికే భక్తులు భారీ సంఖ్యలో రావడంతో ముఖ దర్శన సౌకర్యం కల్పించారు. ఆలయం వెలుపల భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్‌లు ఏర్పాటు చేశారు. అయితే ఆలయ ఆవరణలోని పార్కింగ్ స్థలం సరిపోకపోవడంతో పరిసర ప్రాంతాల్లోని పలు రోడ్లపై వాహనాలను నిలిపారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ అనంతరం దర్శనానికి అనుమతించారు. బంజారాహిల్స్ జగన్నాథ దేవాలయానికి భక్తులు భారీగా తరలిరావడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. తెలంగాణ భవన్ వద్ద ఉన్న పార్కింగ్ స్థలాన్ని సైతం ఆలయానికి వచ్చే వాహనాల కోసం కేటాయించారు. స్వయంభు లక్ష్మీనర్సింహస్వామి (స్వర్ణ) దేవాలయంతో పాటు ఇతర ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రతి ఏడాది జనవరి 1న భక్తులు ఆలయాలకు పోటెత్తుతుంటారు. ఈ ఏడాది సైతం ఇదే పరిస్థితి నెలకొంది. దీనికి తగ్గట్టుగా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


హరే కృష్ణ మూవ్‌మెంట్ దేవాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

సందర్శకుల తాకిడితో భారీగా ట్రాఫిక్ జామ్

ఖైరతాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మార్గ్, పీవీ నర్సింహారావు మార్గ్‌లతో పాటు ఐమాక్స్ పార్కుల్లోకి విపరీతంగా సందర్శకులు రావడంతో కనీసం నడిచేందుకు సైతం వీలు లేకుండా రద్దీ కనిపించింది. చాలామంది తమ వాహనాలను రోడ్లపైనే నిలిపివెళ్లడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. సందర్శకుల రద్దీతో ఖైరతాబాద్ నుంచి పంజాగుట్ట వరకు.. లక్డీకాపూల్ నుంచి మాసాబ్‌ట్యాంక్ వరకు.. ట్యాంక్‌బండ్, లిబర్టీ మార్గాల్లో తీవ్ర ట్రాఫిక్ జాం ఏర్పడింది. అశ్వక దళాలు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు వచ్చి సమీక్షించాయి. ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించేందుకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. మరోవైపు శాంతి భద్రతల పోలీసులు సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, సైఫాబాద్ డివిజన్ ఏసీపీ ఆర్.సంజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు రాజశేఖర్, సైదులు తదితరులు పర్యవేక్షణలో భారీ బందోబస్తు నిర్వహించారు.


జూబ్లీహిల్స్‌లో ట్రాఫిక్ రద్దీ

ఏడు కిలోల గంజాయి పట్టివేత

చంపాపేట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కంచన్ బాగ్ పోలీసులు జరిపిన వాహనాల తనిఖీ ల్లో 7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ లింగరాజు కథనం ప్రకారం .. ఒడిశా నుంచి దూల్‌పేటకు మూడు ద్విచక్ర వాహనాల ద్వారా గంజాయిని తరలి స్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు డీఎంఆర్ఎల్ చౌరస్తా సమీపంలో సాయి బాబా ఆలయం ఎదుట బుధవారం సాయంత్రం ఐదున్నర గంటల ప్రాంతంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఒడిశాకు చెందిన బిశ్వజిత్ అధికారి(30) అతని భా ర్య బిచిత్ర విశ్వాస్(20) ద్విచక్ర వాహనంపై మూడు కిలోల గంజాయి, ఒడిశాకు చెంది న తపన్ మండప్(50) ద్విచక్ర వాహనం పై రెండు కిలోల గంజాయి, దూల్‌పేటకు చెందిన వివేక్‌సింగ్(22) ద్విచక్ర వాహనం పై రెండు కిలోల గంజాయిని తరలి స్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు, మూడు వాహనాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులను ఇష్టమైన రంగంలో ఎదగనివ్వాలి

ఎర్రగడ్డ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను వారికి ఇష్టమైన రంగాల్లో ఎదగనివ్వాలని సినీ నిర్మాత, కోవిద సర్వోదయ ఫౌండేషన్ చైర్మన్ హనుయరెడ్డి అన్నారు. బుధవారం ఎర్రగడ్డ హేమావతి నగర్‌లో డ్యాన్సర్ గూడూరి వన్‌రాజురెడ్డి ఏర్పాటు చేసిన వింగ్స్ ఆఫ్ ఫైర్ డ్యాన్స్ స్టూడియోను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. డ్యాన్సర్ వన్‌రాజు రెడ్డిలో ఎంతో టాలెంట్ ఉందని, అతడు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఆశీర్వదిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గూడూరు చెన్నారెడ్డి మాట్లాడుతూ.. వన్‌రాజురెడ్డి తన చిన్నతనం నుండే డ్యాన్స్‌లో తన ప్రతిభను కనబరుస్తూ వచ్చాడన్నారు.

రహదారి భద్రత మాసోత్సవాలు ప్రారంభం

- ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన
- పలు ప్రాంతాల్లో ర్యాలీలు


బ్యానర్లతో రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు బుధవారం ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించి రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం తాగి వాహనం నడపవద్దని, సీటు బెల్ట్ ధరించాలని, ముందుగా బయల్దేరి క్షేమంగా గమ్యం చేరాలని సూచించారు. జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు రమేష్ చిదుర, మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మార్గ్ నుంచి ఖైరతాబాద్ వంతెన మీదుగా ఆర్టీఏ కార్యాలయం వరకు రవాణా శాఖ అధికారులు, సిబ్బంది ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు. నిబంధనలు రాసి ఉన్న ఫ్లెక్సీలతో నాగోల్ అల్కాపురి ఎక్స్‌రోడ్ నుంచి నాగోల్ ఎక్స్‌రోడ్ వరకు ర్యాలీ చేపట్టారు. పలు ప్రాంతాల్లో వాహనదారులను హెల్మెట్ ధరించాలని, నిబంధలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని గులాబీ పూలు ఇచ్చి కోరారు. ఈ నెల 31 వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.


యువతులకు గులాబీలు ఇచ్చి అవగాహన కల్పిస్తూ..


అగ్నిప్రమాదంలో కాలిపోయిన వైరింగ్

సాఫ్ట్‌వేర్ కంపెనీలో అగ్ని ప్రమాదం

హైదరాబాద్ సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని వాణిజ్య భవనంలో అగ్ని ప్రమాదం సంభవించింది. భవనం ఐదో అంతస్తులోని నిపుణ్ ఐటీ సొల్యూషన్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని రెండు ఫైరింజన్లతో మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో విలువైన సామగ్రి, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిబూడిదయ్యాయి. ఐదంతస్తులు ఉన్న వాణిజ్య సముదాయం కావడంతో అందులోని ఇతర కార్యాలయాల సిబ్బంది ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఇప్పుడే వస్తానన్నాడు.. శవమై కనిపించాడు


విష్ణు రూపాని

పంజాగుట్ట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు రోజుల క్రితం అదృశ్యమైన వ్యాపారి ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కుళ్లిపోయిన స్థితిలో శవమై కనిపించాడు. ఓ గదిలో నుంచి దుర్వాసన రావడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడకు చెందిన విష్ణు రూపాని(45) కుటుంబ సభ్యులతో కలిసి కిరాణా స్టోర్‌తో పాటు పలు వ్యాపారాలు చేస్తున్నాడు. డిసెంబరు 29న రోజు మాదిరిగానే షాపు మూసివేసి రాత్రి 10.30 సమయంలో ఇంటికి వచ్చాడు. పని ఉందని, కాసేపట్లో తిరిగి వస్తానని ఇంటి నుంచి వెళ్లాడు. అర్ధరాత్రి అయినా రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో 30వ తేదీన కుటుంబ సభ్యులు పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బుధవారం ఎస్ఆర్‌నగర్ పీఎస్ పరిధిలోని శ్రీనివాసనగర్ ఈస్ట్ బుద్ధనగర్ లోని ఓ గదిలో నుంచి దుర్వాసన వస్తుందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సిబ్బంది అక్కడకు చేరుకొని పరిశీలించగా కుళ్లిపోయిన స్థితిలో విష్ణు రూపాని మృతదేహం కనిపించింది. ఆ గదిలో మద్యం తాగిన ఆనవాళ్లు కనిపించాయి. సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా విష్ణుతో పాటు మరో వ్యక్తి ఆ గదిలోకి వెళ్లాడు. సుమారు మూడు గంటల తర్వాత అతడు బయటకు వచ్చాడు. కెమెరాలకు దొరకకుండా ముఖానికి వస్త్రం కట్టినట్టు తెలుస్తోంది. ఆర్థిక లావాదేవీల కారణంగా స్నేహితుడే విష్ణు రూపానిని హతమార్చినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. గదిలో నుంచి బయటకు వచ్చిన వ్యక్తి గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. అతడిని అదుపులోకి తీసుకుంటే పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది.

సీరియల్ నటిని వేధిస్తున్న వ్యక్తి అరెస్ట్

బంజారాహిల్స్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సీరియల్ నటిని వేధిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఎం.వెంకటలక్ష్మి సీరియల్ నటి. 2012లో కృష్ణమోహన్ అనే వ్యక్తితో వివాహం కాగా కుమార్తె, కుమారుడు ఉన్నారు. అయితే తర్వాత భర్తతో విబేధించి ఆమె పిల్లలతో కలిసి యూసుఫ్‌గూడ కృష్ణానగర్‌లో వేరుగా ఉంటుంది. గత ఏడాది సెప్టెంబర్‌లో శ్రావణ సంధ్య సీరియల్‌లో నటిస్తుండగా బత్తుల ఫణి తేజ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. కొద్ది కాలానికి వివాహం చేసుకుంటానని చెప్పడంతో ఆమె నిరాకరించింది. దీంతో ఆమెను వేధించడం ప్రారంభించాడు. ఆమె అత్తగారికి ఫోన్‌చేసి షూటింగ్ సమయంలో ఇతరులతో కలిసి ఉన్న ఫొటోలను బ్యానర్ల రూపంలో సంక్రాంతికి ఊర్లో కడతానని బెదిరించాడు. మరోవైపు రోజూ వందల సంఖ్యలో అసభ్యకరమైన మెసేజ్‌లతో వెంకటలక్ష్మిని మానసికంగా వేధిస్తున్నాడు. దీంతో బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్ నియోజకవర్గాల పరిధిలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు, యువత కేక్‌లు కట్ చేసుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మహిళలు తమ ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులను తీర్చిదిద్దారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులను కలిసి తమ అభిమానులు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.


ఎంపీ ఎం.అనిల్ కుమార్ యాదవ్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ మైనార్టీ విభాగం చైర్మన్ మోసిన్ ఖురేషీ, నాయకులు కిరణ్‌యాదవ్, అజయ్‌కుమార్


ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న ఫిలింనగర్ కాంగ్రెస్ నాయకులు నగేష్ సాగర్, సంపంగి కిరణ్ తదితరులు


మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న బీజేపీ నాయకులు గడ్డం వెంకటస్వామి, ముద్దంగుల శ్రీనివాస్ తదితరులు


సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు నామన సంతోష్ కుమార్, కట్టా బలరాం, కూతురు నర్సింహ, సుమిత్ సింగ్ తదితరులు


సీఎం రేవంత్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న సీనియర్ కాంగ్రెస్ నేత విశాల్ సుధాం


టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు అరవింద్‌కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న పార్టీ నాయకులు సలీం, మాయావతి, విజయలక్ష్మి తదితరులు


బోరబండ బస్టాప్ వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకురాలు హబీబా సుల్తానా


రహ్మత్‌నగర్ బ్రహ్మశంకర్‌నగర్‌లోని శాలేమ్ చర్చిలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ జాతీయ కార్యదర్శి డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి తదితరులు


రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో కేక్ కట్ చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు


కృష్ణకాంత్ పార్కు వద్ద ఉన్న సాయిబాబా ఆలయంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన షిరిడీసాయి ద్వారకామయి ట్రస్టు సభ్యులు సి.బాలప్రకాష్, గోలి మల్లారెడ్డి, బరిగెల జ్ఞానేశ్వర్



తిరుప్పావై సేవలో కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ నోముల ఇందిరాప్రకాశరావు దంపతులు



శ్రీనివాస్‌నగర్ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు



చిలకలగూడ పార్కులో కేకును కట్‌చేస్తున్న వాకర్స్ తదితరులు

న్యూ హ్యాపీ!

- గ్రాండ్‌గా నూతన సంవత్సర వేడుకలు
- అర్ధరాత్రి తర్వాత కేక్‌లు కట్ చేసి సంబురాలు
- ఇళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులేసి.. 2025కు ఆహ్వానం
- కొత్త ఏడాది క్యాలెండర్ల ఆవిష్కరణ
- ఆలయాల్లో భక్తుల కిటకిట
- ప్రజాప్రతినిధులను కలిసి శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్లు, ఇతర ప్రముఖులు

2025 సంవత్సరాన్ని సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ నియోజకవర్గాల ప్రజలు, యువత, విద్యార్థులు, రాజకీయనాయకులు, ఉద్యోగులు కొంగొత్త ఆశలు, ఆశయాలు నెరవేరాలని హ్యాపీగా ఆహ్వానించారు. అర్ధరాత్రి తర్వాత కేక్‌కటింగ్‌లు చేశారు. డ్యాన్సులు చేస్తూ కేరింతలు కొట్టారు. అర్ధరాత్రి నుంచే మహిళలు తమతమ ఇళ్ల ముంగిట రంగురంగుల రంగవల్లులను అందంగా వేసి 2025ను ఆహ్వానించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సంవత్సరం అంతా శుభమే జరగాలని దేవుళ్లను కోరుకున్నారు. పలు చోట్ల నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ప్రజాప్రతినిధులను కార్పొరేటర్లు, ఇతర ప్రముఖులు, నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాది తొలిరోజు హ్యాపీహ్యాపీగా గడిపారు. బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆవిష్కరించారు. సికింద్రాబాద్ గణేశ్ టెంపుల్‌కు భక్తులు పోటెత్తారు.

బౌద్ధనగర్, జనవరి1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం-2025 పురస్కరించుకుని సికింద్రాబాద్ నియోజకవర్గంలో పలు ఆలయాలు భక్తులు కిటకిటలాడాయి. నామాలగుండు శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుప్పావై సేవ కనులపండువగా సాగింది. ఆలయ చైర్మన్ నోముల ఇందిరా ప్రకాశరావు ఆధ్వర్యంలో ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని మూలవిరాట్ కల్యాణ వేంకటేశ్వరస్వామివారిని ప్రత్యేకంగా అలకరించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్మికసంఘం నాయకుడు కుంచాల ఏడుకొండలు, నాయకులు బిట్ల రఘు నందన్‌కుమార్, నాగులూరి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. శ్రీనివాసనగర్‌లో గోదాసమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. ఈఓ రాజేష్‌కుమార్, ధర్మకర్తమండలి చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ తదితరులు ఆలయ ప్రాంగణంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. చిలకలగూడ పార్కులో వాకర్స్ బాట్మింటెన్ షటిల్‌టీమ్ తదితరులు కేక్‌ను కట్ చేసి, వేడుకలను నిర్వహించారు.



మహంకాళి అమ్మవారు

ప్రత్యేక అలంకారంలో లాల్‌బజార్ అమ్మవారు

తిరుమలగిరి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బొల్లారం, తిరుమలగిరిలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మహిళలు పురుషులు తమ పిల్లాపాపలతో కలిసి దేవాలయాలను దర్శించారు. బొల్లారంలోని తోట ముత్యాలమ్మ, కుటియా టెంపుల్, డౌటన్ బజార్‌లోని హనుమాన్ దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. లాల్‌బజార్‌లోని శ్రీమహంకాళి దేవాలయంలో అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. నిర్వాహకులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లుచేశారు. దేవాలయాన్ని రంగురంగులపూలతో అలంకరించారు.

పదిరకాల పండ్లతో వెంకటేశ్వరస్వామికి అలంకరణ

బోయిన్‌పల్లి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని భక్తులు బోయిన్‌పల్లిలోని పలు దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఏడాది ప్రజలు సుఖసంతోషాలతో తమ పిల్లాపాపలను చల్లంగా చూడాలని భక్తులు దేవుళ్లను వేడుకున్నారు. బోయిన్‌పల్లి న్యూసిటీ కాలనీలోని వెంకటేశ్వరస్వామి, తాడ్‌బంద్ ఆంజనేయస్వామి, బాపూజీనగర్ నల్లపోచమ్మ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవతామూర్తులను ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. బోయిన్‌పల్లి న్యూసిటీ కాలనీలోని వెంకటేశ్వరస్వామిని ఆలయ ప్రధాన అర్చకుడు పవన్‌స్వామి పదిరకాల పండ్లతో అలంకరించారు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం తెల్లవారుజామున 4గంటల నుంచే ఆలయంలో తిరుప్పావై వ్రతం, గోదారంగనాయకుల కీర్తనలు చేశారు. భక్తులు భారీగా తరలివచ్చారు. దర్శనం అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు దీపక్ స్వామి, శ్రీధర్ స్వాములు, ఆలయ కమిటీ సభ్యులు, నారాయణ, లక్ష్మణ్, యాదయ్య, రామ్మోహనరావు పాల్గొన్నారు.



పండ్ల అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తున్న బోయిన్‌పల్లి వెంకటేశ్వరస్వామి

గణేష్ టెంపుల్‌కు పోటెత్తిన భక్తులు

రెజిమెంటల్‌బజార్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం పురస్కరించుకుని సికింద్రాబాద్ గణేష్ టెంపుల్‌కు భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయం కిక్కిరిసి పోయంది. భక్తులను నియంత్రించడానికి గేట్లు మూసి వేసే పరిస్థితిఏర్పడింది. సికింద్రాబాద్ స్టేషన్ ప్రధాన రోడ్డులో ఉండటం ఆలయం ముందు రోడ్డు సైతం ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ప్రధాన ద్వారం ద్వారా రూ.500 టోకెన్ తీసుకున్న వారిని మాత్రమే అనుమతించి, మరో గేట్ నుంచి ధర్మ దర్శనానికి అనుమతించడంతో రద్దీ ఏర్పడింది. అప్రమత్తమైన గోపాలపురం లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు నరేష్, వెంకట్‌రాములు సిబ్బందితో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. కొద్దిసేపు జూబ్లీ బస్‌స్టేషన్ వైపు వెళ్లే బస్సులను దారి మళ్లించారు.

సుఖసంతోషాలు వెల్లివిరియాలి

మారేడుపల్లి: కొత్త సంవత్సరంలో ప్రతి ఇంటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆకాక్షించారు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం వెస్ట్ మారేడుపల్లిలోని కార్యాలయం వద్ద సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్లకు చెందిన పలువురు నాయకులు, కాలనీల ప్రజలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, పాత్రికేయులు మారేడ్‌పల్లికి చెందిన సీనియర్ సిటిజన్స్ హన్మంతరావు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

బల్కంపేట ఎల్లమ్మ దేవాలయ కమిటీ మాజీ సభ్యులు గ్రీన్‌సిటీ ఎండీ సుబ్బరాజు ఆధ్వర్యంలో బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ అమ్మవారి నూతన సంవత్సర క్యాలెండర్‌ను తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆవిష్కరించారు.

పండితుల ఆశీర్వచనం

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సికింద్రాబాద్‌లోని శ్రీఉజ్జయినీ మహాకాళి ఆలయ ఈఓ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తలసానిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, అశోక్ యాదవ్, మహేష్ కుమార్ గౌడ్, మహేందర్, అరుణ్ భట్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళలు



బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



క్యాలెండర్ ఆవిష్కరణలో వీసీ కుమార్, డైరెక్టర్లు

ఓయూకు ఉత్తమ గుర్తింపునకు కృషిచేద్దాం

క్యాలెండర్, డైరీ, ఇన్ఫర్మాటికా ఆవిష్కరణలో వీసీ కుమార్

హైదరాబాద్‌సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): 2025లో ఉస్మానియా యూనివర్సిటీకి ఉత్తమ గుర్తింపు దిశగా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషిచేయాలని, న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్‌లో మెరుగైన ర్యాంకును సాధించేందుకు పనిచేద్దామని వీసీ ఎం.కుమార్ అన్నారు. బుధవారం ఉస్మానియా వర్సిటీ కొత్త సంవత్సర క్యాలెండర్, డైరీ, ఇన్ఫర్మాటికాను వీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ.. సరికొత్త ఉత్సాహం, ఉత్తేజంతో రానున్న రోజుల్లో ఉస్మానియా కుటుంబ సభ్యులు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఓయూ క్యాలెండర్, డైరీ, ఇన్ఫర్మాటికా ఓయూ ప్రెస్‌లో రేపటి నుంచి అమ్మకానికి అందుబాటులో ఉంటాయని, మూడో తేదీ నాటికి ఆయా విభాగాలకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జీ.నరేష్‌రెడ్డితో పాటు వివిధ విభాగాల డైరెక్టర్లు తదితరులున్నారు.



నూతన సంవత్సరం సందర్భంగా మోండా కార్పొరేటర్ కొంతం దీపిక సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కొంతం నరేష్, బస్తీవాసులు పాల్గొన్నారు. -(రెజిమెంటల్‌బజార్, ఆంధ్రజ్యోతి)



నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీని కలిసి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపిన ఎంఐఎం రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు పాపడ్ అశోక్. -(రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి)



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఈఓ

క్యాలెండర్ ఆవిష్కరణ

తిరుమలగిరి: ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బుధవారం బొల్లారం డౌటన్ బజార్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన శ్రీ హనుమాన్ దేవాలయంలో హనుమాన్‌సేవక్ అర్చకుల సంయుక్త ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఈఓ మహేందర్ రెడ్డి ఆవిష్కరించారు. హనుమాన్ సేవక్ సభ్యులు దేవాలయం అభివృద్ధి కోసం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.

కంటోన్మెంట్‌లో టీడీపీ వేడుక

మారేడుపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బుధవారం పికెట్ జేబీఎస్ చౌరస్తాలో గల ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించిన వేడుకలకు మల్కాజిగిరి పార్లమెంట్ టీడీపీ అడ్‌హక్ కమిటీ మెంబర్ జే.నర్సింగ్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రతాప్, మధుసూధన్, అశోక్ యాదవ్, అనురాధ, గోపి తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద జరిగిన వేడుకల్లో పాల్గొన్న కంటోన్మెంట్ టీడీపీ శ్రేణులు



దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్, రైల్‌నిలయంలో నూతన సంవత్సరం వేడుకల్లో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్న రైల్వే ఉద్యోగులు. (చిలకలగూడ, ఆంధ్రజ్యోతి)

డ్రంకెన్ డ్రైవ్‌లో 205 కేసులు

రెజిమెంటల్‌బజార్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా మంగళవారం రాత్రి నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 205 కేసులు నమోదైనట్లు నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు తెలిపారు.



డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో ఏసీపీ శంకర్‌రాజు, ఎస్సై సతీష్

	టూ వీలర్	త్రీ వీలర్	ఫోర్ వీలర్	మొత్తం	త్రిబుల్ రైడింగ్
గోపాలపురం	26	-	1	27	17
మహంకాళి	32	-	1	33	21
మారేడ్‌పల్లి	26	-	2	28	08
తిరుమలగిరి	20	-	6	26	01
బేగంపేట	40	-	10	50	26
బోయిన్‌పెల్లి	31	1	9	41	03
మొత్తం	175	1	29	205	76

మెట్రోరైలు పొడిగింపుపై మంత్రి పొన్నం హర్షం

హైదరాబాద్ సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర కానుకగా శామీర్‌పేట్, మేడ్చల్ ప్రాంతాల వరకు మెట్రో మార్గాలను పెంచేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు మెట్రోను పొడిగించాలని గతంలో తాను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. సుదీర్ఘకాలంగా ఉత్తర తెలంగాణ జిల్లాలైన కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ వైపు వెళ్లే వాహనదారులు నగర శివారు వరకు ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడేవారని, ఈ రూట్లలో ఇప్పటికే డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ మంజూరు కావడం, తాజాగా జేబీఎస్-శామీర్‌పేట్ వరకు, ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు మెట్రో రైలు కోసం డీపీఆర్ తయారు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో తమ ప్రాంతవాసుల కష్టాలు తొల గనున్నాయని చెప్పారు. ఈ రూట్లలో మెట్రో పూర్తయితే ఉత్తరతెలంగాణ జిల్లాలకు సమయం ఆదా అవుతుందన్నారు.

కంటోన్మెంట్ అభివృద్ధికి బీజేపీ నాయకుల కృషి

- బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

బోయిన్‌పల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు ప్రాంత అభివృద్ధిలో బీజేపీ నాయకుల కృషి ఎంతో ఉందని బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ అన్నారు. బుధవారం కంటోన్మెంట్ 6వ వార్డు పరిధిలోని పద్మనాభకాలనీ, మారుతీనగర్ కాలనీల్లో 15 లక్షల రూపాయలతో చేపట్టనున్న కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను ఆయన స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణను స్థానికులు సన్మానించారు. 6వ వార్డు బీజేపీ అధ్యక్షులు అజయ్‌గౌడ్, నాయకులు రవీందర్ రెడ్డి, నాగభూషణ్, నారాయణ, స్వరూప, భారతి, రమేష్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నిరంజన్‌పాల్గొన్నారు.



కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న రామకృష్ణ

పనిచేసే వారికి గుర్తింపు: ఎమ్మెల్యే శ్రీగణేశ్

సికింద్రాబాద్, జనవరి1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. కాంగ్రెస్‌లో పని చేస్తున్న నాయకులకు, కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని, పార్టీలో పనిచేసేవారికి నామినేటెడ్ పోస్టులు ఇస్తామని అన్నారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని సికింద్రాబాద్ స్టేషన్ సమీపంలో శ్రీగణపతి దేవాలయ ధర్మకర్తగా అవకాశం కల్పించాలని రెజిమెంటల్‌బజార్‌కు చెందిన పి.ప్రభాకర్ ఎమ్మెల్యేను కలిసి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా చైర్మన్‌పదవికి కూడా అవకాశం కల్పించాలని కోరారు.



ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న జంపన్న ప్రతాప్

ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

బోయిన్‌పల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలపై జరుగుతున్న దాడులను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఆలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన్న ప్రతాప్ సూచించారు. కంటోన్మెంట్ 1వ వార్డులోని చిన్నతోకట్ట నక్కలబస్తీలోని గడీల మైసమ్మ రేణుక ఎల్లమ్మ ఆలయంలో అరుణ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆలయ కమిటీ సభ్యులతో కలిసి జంపన్న ప్రతాప్ బుధవారం ప్రారంభించారు. ప్రతాప్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు కంటోన్మెంట్‌లోని 45 ఆలయాలకు అరుణ్‌యాదవ్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కంటోన్మెంట్‌లోని అన్ని ఆలయాలకు సీసీ కెమెరాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖేష్ యాదవ్, క్రాంతి కొండల్ యాదవ్, బల్వంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తుకారాంగేట్‌లో మాదకద్రవ్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డీబీఎఫ్ నాయకులు

మద్యం, డ్రగ్స్‌కు యువత బానిసలు కావొద్దు

- దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన

అడ్డగుట్ట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మద్యం, మాదక ద్రవ్యాలకు యువత బానిసలు కావద్దని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన సూచించారు. బుధవారం తుకారాంగేట్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మద్యం, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ వాడకం వల్ల కుటుంబాలు చితికిపోతున్నాయని, మహిళలపై హింస, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంస్థ నగర కన్వీనర్ ఉమక్క, మారేడుపల్లి మండల అధ్యక్షురాలు బన్నమ్మ పాల్గొన్నారు.